వ్యవ'సాయం' ఏది బాబూ!

- అన్నదాతకు ఏడాదికి రూ.20వేలు హామీ ఇచ్చి ఊసెత్తని సీఎం చంద్రబాబు
- రైతుభరోసా పేరు మార్చారే తప్ప సాయంపై స్పష్టతనివ్వని కూటమి
- ఖరీఫ్ ప్రారంభమై నెలవుతున్నా అందని అన్నదాత సుఖీభవ


అంబర్‌పేట ఏరియాలో వరి నాట్లు వేసిన దృశ్యం


గుండుగొలను శివారు వర్షాలకు మునిగిన పంట చేలు

భీమడోలు: రైతులకు టీడీపీ పాలనలో సాగు ఇబ్బందులు తప్పడం లేదు. ఖరీఫ్ సాగుకు పెట్టుబడి సాయం అందుతుందని ఆశ పడిన రైతులకు నిరాశే మిగిలింది. రూ.20వేలు అందజేస్తామని హామీ గుప్పించిన సీఎం చంద్రబాబు రైతులకు మొండి చెయ్యి చూపారు. గత జగనన్న ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన రైతుభరోసా పథకం పేరును అన్నదాత సుఖీభవ అంటూ మార్చారే తప్ప సాయం మాత్రం అందించలేదు. జూలై నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనుంచే వర్షాలు అనుకులంగానే కురిశాయి. అయితే వారం క్రితం కురిసిన వర్షాలు నారుమడులకు ఉపయోగపడ్డాయి. అయితే పెట్టుబడి సాయం అందకపోవడంతో రైతులు నిరశకు గురవుతున్నారు. కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకానికి సంబంధించి తొలి విడత సాయంగా రూ.2వేలు రైతుల ఖాతాల్లో జమ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఇస్తానన్న పెట్టుబడి సాయంపై ఊసేలేదు. మే లోనే రైతు భరోసా నగదు రూ.5,500 ఇవాల్సి ఉండగా ఎన్నికల కోడ్ అమలు నేపథ్యంలో అది కాస్త ఆగిపోయింది. ప్రస్తుం కేంద్రం అందజేసిన పీఎం కిసాన్ నగదుతో కూలీల ఖర్చులకు ఉపయోగపడింది. ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు కోసం రైతులు అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితుల్లో రైతులు ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తున్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రారంభంలోనే పెట్టుబడి సాయం

గతంలో పంటల సాగు పెట్టుబడి కోసం రైతన్నలు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సాగు ఆరంభంలోనే పెట్టుబడి సాయాన్ని అందించేది. పీఎం కిసాన్ సాయం రూ.6వేలు, రైతు భరోసా రూ.7500 కలిసి ఏటా రూ.13,500 చొప్పున మూడు విడతలుగా రైతులకు అందేది. ఇప్పుడా పరిస్థితి లేకపోవడంతో మళ్లీ కష్టాలు మొదలయ్యాయని రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

రైతుల ఎదురు చూపు

ఉంగుటూరు నియోజకవర్గంలో ఉంగుటూరు, భీమడోలు, గణపవరం, నిడమర్రు మండలాల్లో 40,597 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. వారిలో భీమడోలు 13,362 ఎకరాలు, ఉంగుటూరు మండలంలో 23,672 ఎకరాలు, నిడమర్రు మండలంలో 3536 ఎకరాలు, గణపవరం మండలాల్లో 11,713 ఎకరాల్లో అన్నదాతలు ఖరీఫ్ సాగు చేస్తున్నారు. గతంలో పీఎం కిసాన్‌తో పాటు భరోసా ఒకేసారి అందుతుండడంతో పెట్టుబడికి ఉపయోగపడేది. ఇప్పుడు పీఎం కిసాన్ రూ.2వేలు మాత్రమే అందడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. తాము అధికారంలోకి వస్తే రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.20వేలు అందజేస్తామని కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించింది. కూటమి ప్రభుత్వం వచ్చి సుమారు రెండు నెలలు గడుస్తున్నా రైతుల పెట్టుబడి సాయంపై కనీస ప్రకటన చేయలేదు. దీంతో సాగు ఖర్చుల కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి ఉందని రైతులు వాపోతున్నారు.

మాట నిలబెట్టుకోవాలి



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రైతులకు ఇస్తానన్న పెట్టుబడి సాయం రూ.20వేలు ఇచ్చి మాట నిలబెట్టుకోవాలి. పంట పనులు ప్రారంభంలోనే పెట్టుబడి సాయం అందిస్తే రైతులకు అప్పు చేయాల్సిన పని ఉండదు. ఇప్పటివరకూ రైతులు పెట్టుబడి సహాయం కోసం ప్రభుత్వం ఒక్క మాట కూడా మాట్లాడలేదు.

– కె.శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి, కౌలు రైతు సంఘం, ఏలూరు

16 నుంచి రెవెన్యూ సదస్సులు

ఉంగుటూరు: గ్రామాలలో భూ సమస్యల పరిష్కారానికి ఈనెల 16వ తేదీ నుంచి రెవెన్యూ సదస్సులు ప్రారంభిస్తున్నట్లు తహసీల్దార్ పి.సతీష్ పేర్కొన్నారు. సెప్టెంబర్ 21వ తేదీ వరకు గ్రామ రెవెన్యూ సదస్సులు సంబంధిత అధికారుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేశామని తెలిపారు. గ్రామ సచివాలయాలు, పంచాయతీ కార్యాలయాల వద్ద ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సమావేశాలు కొనసాగుతాయని భూ సమస్యలు ఉన్న ప్రజలు అందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. 16వ తేదీన వెల్లమిల్లి, 19న బాదంపూడి, 21న బొమ్మిడి, 23న కాకర్లమూడి, 24న వి ఎపురంలో, 27న కాగుపాడు, 29న దొంతవరం, 30న రావులపర్రు, సెప్టెంబర్ 2న రాచూరు, 4న చేబ్రోలు, 6న తల్లాపురం, 9న చేబ్రోలు ఖండ్రిక, 11న ఉంగుటూరు, 13న కైకరం, 17న అక్కుపల్లి గోకవరం,19న నల్లమాడు, 21న గోపినాధపట్నం గ్రామాలలో సదస్సులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

ఈ-క్రాప్ నమోదుతోనే పంటల బీమా

దెందులూరు: ఈ-క్రాప్ నమోదుతోనే పంటలకు ప్రభుత్వ బీమా అమలు చేస్తారని, దెందులూరు తహసీల్దార్ బి.సుమతి అన్నారు. సోమవారం దెందులూరు తహసీల్దార్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను మంగళవారం శివారు ప్రాంతాల్లో రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వ్యవసాయ శాఖ సిబ్బంది గ్రామ శివారు ప్రాంతాల్లో పొలాలకు వచ్చి నమోదు చేస్తారన్నారు. ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోతే ప్రభుత్వం పరిహారం అందిస్తుందన్నారు. ఉద్యాన, వ్యవసాయ శాఖల అధీనంలో వేసుకున్న పంటలను వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖాధికారులు ఈ-క్రాప్ ద్వారా నమోదు చేసి పొలం, పంట, విస్తీర్ణం, సాగు, దిగుబడి, నష్టం, తదితర వివరాలను నిబంధనల మేరకు ఈ-క్రాప్ విధానంలో నమోదు చేస్తామన్నారు.

క్లుప్తంగా

హిందూ సంఘాల ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

దెందులూరు : హిందూ సంఘాల ఆధ్వర్యంలో బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న మారణ హోమానికి నిరసనగా, హిందువులను రక్షించాలని దెందులూరు మండల బీజేపీ అధ్యక్షుడు ఎం.బుజ్జిగోపాల్ కోరారు. సోమవారం దెందులూరు మండలం సానిగూడెం, గాలాయగూడెం, సోమవరప్పాడు మీదుగా ర్యాలీగా ఏలూరు వెళ్లారు. మృతి చెందిన వారికి గాలాయగూడెంలో కొవ్వొత్తులతో నిరసన తెలియజేశారు.

ధాన్యం బకాయిలపై వినతి


ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్‌తో మాట్లాడుతున్న బీజేపీ మండల అధ్యక్షుడు మందూరి బుజ్జిగోపాల్

దెందులూరు: అన్ని గ్రామాల్లో రైతులు ధాన్యం బకాయిలు ఇప్పటి వరకు రాక రైతులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారని బీజేపీ దెందులూరు మండల అధ్యక్షుడు ఎం.బుజ్జిగోపాల్ అన్నారు. సోమవారం ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ నివాసంలో ఆయనను కలిసి బుజ్జిగోపాల్ వినతి పత్రం అందజేశారు. ప్రస్తుతం వ్యవసాయ సాగు పనులు ముమ్మరంగా సాగుతున్నాయన్నారు. రైతులకు ప్రభుత్వం అందించే సాయం ఇవ్వకపోవడంతో రెండు రకాలుగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రైతుల ధాన్యం బకాయిలు, వ్యవసాయ సాగు సాయం వెంటనే జమయ్యేలా చర్యలు తీసుకోవాలని మంత్రిని గోపాల్ కోరారు.

కార్యదర్శులకు, సర్పంచ్‌లకు శిక్షణ


శిక్షణ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి

ఉంగుటూరు: చెత్త నుంచి సంపద సృష్టించే కార్యక్రమం మంచి పరిణామమని, ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి అన్నారు. సోమవారం ఉంగుటూరులో సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు 24-25లో రిఫ్రెషర్ శిక్షణ సమావేశం ఎంపీడీవో శర్మ అధ్యక్షతన నిర్వహించారు. మూడు రోజులు పాటు నిర్వహించే ఈ శిక్షణ సమావేశంలో ముఖ్య అతిథిగా ఎంపీపీ పాల్గొని మాట్లాడుతూ గ్రామాల్లో చెత్త లేకుండా చూడాలన్నారు. వీధిలైట్లు, మంచి నీరు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. సమావేశంలో ఈవోపీఆర్‌డీ కేవీ గిరిధర్, డీపీఆర్‌సీ భూషణం, వెంకట్రావు, ముత్తయ్య, సోమరాజు, విజయకుమార్, శిక్షణ ఇచ్చారు. సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా గరుడ సేవ


బాలవెంకన్నకు గరుడసేవా శోభయాత్రలో పాల్గొన్న భక్తులు

నిడమర్రు: శ్రావణ పౌర్ణమి పురస్కరించుకుని నిడమర్రు వెంకటాపురంలోని పద్మావతి సమేత గోదాదేవి బాలవెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం శ్రావణ శుద్ధ అష్టమి సందర్భంగా విఖనస జయంతి, నవ బ్రహ్మసత్కారం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లకు గరుడ సేవా శోభ యాత్రను నిర్వహించారు. ఆగమపండితులు చానమిల్లి వాస్తవ్యులు శ్రీనివాసులు శేషాచలం ఆధ్వర్యంలో ఎనిమిది మండలాల వైఖానస సాకీయుల కలసి స్వామి వారికి విఖనస జయంతి ఉత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన పూజల్లో పలువురు గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భద్రకాళీ ఆలయంలో చండీహోమం


భద్రకాళీ ఆలయంలో చండీహోమం నిర్వహిస్తున్న దృశ్యం

ఉంగుటూరు: మండలంలోని శ్రావణ పౌర్ణమి సందర్భంగా భద్రకాళీ ఆయలంలో సోమవారం చండీహోమం ఘనంగా నిర్వహించారు. ఆలయ పర్యవేక్షకుడు పాతూరి వంశీ ఆధ్వర్యంలో ఈ హోమం జరిపారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

అసంబద్ధ సర్దుబాటు తగదు


భీమడోలులో ఎంఈవోకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం


ఎంఈఓ రవీంద్రభారతికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

గణపవరం: అసంబద్ధంగా ఉపాధ్యాయులకు అన్యాయం జరిగేలా నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల క్రమబద్ధీకరణను ఉపాధ్యాయులు బహిష్కరిస్తున్నట్లు గణపవరం మండల ఫ్యాప్టో నాయకులు ప్రకటించారు. సోమవారం సాయంత్రం గణపవరం ఎంఈవో కార్యాలయంలో నిర్వహించిన ఉపాధ్యాయుల కౌన్సిలింగ్ కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నట్లుగా ఫ్యాప్టో తరపున లేఖను ఎంఈవోలు పుచ్చల శేషు, గొర్రెల బాలయ్యలకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీ ప్రకారం 117 జీవోను రద్దు చేయాలని, జీవో నెం.53 ప్రకారం మిగులు ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలనికోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్, ఎస్‌టీయూ, ఏపీటీఎఫ్, పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఉంగుటూరు: ఉపాధ్యాయుల పని సర్దుబాటు ఉత్తర్వుల్లో అసంబద్ధ విధానాలను సవరించాలని ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఉపాధ్యాయ సంఘ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఎంఈఓ రవీంద్రభారతికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల యుటిఎఫ్ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు, యు. రాంబాబు, నడి. జోగినాయుడు, జిల్లా కార్యదర్శి సీహెచ్ శ్రీధర్, మండల కార్యవర్గ సభ్యులు కె.ప్రేమకుమార్ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి


మాదక ద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

గణపవరం (భీమడోలు): విద్యార్థులు మాదక ద్రవ్యాలకు, చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ చదువుపై దృష్టి కేంద్రీకరించాలని భీమడోలు సీఐ బీబీ రవి కుమార్, భీమడోలు ఎక్సైజ్ సీఐ గిరిజ అన్నారు. సోమవారం నషా ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా భీమడోలులో గీతాంజలి జూనియర్ కాలేజి, మాధురీ జూనియర్ కాలేజ్‌ల్లో విద్యార్థులకు డ్రగ్స్ వినియోగం, అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత చెడు మార్గం పట్టడానికి మాదక ద్రవ్యాల వినియోగమే కారణమన్నారు. మాదక ద్రవ్యాల నిర్మూలన అందరి బాధ్యతగా భావించాలని, ఎవరైనా మాదక ద్రవ్యాలు సరఫరా చేస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని 14500 టోల్‌ఫ్రీ నెంబరుకు ఫోన్ చేయాలని చెప్పారు. ఈ సందర్భంగా డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేసి, గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు.

జీవ వైవిధ్యాన్ని పరిరక్షించాలి


జీవ వైవిధ్యంపై చర్చా పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యార్థులు జీవ వైవిధ్యంపై అవగాహన కలిగి ఉండడమే కాక, జీవ వైవిధ్యాన్ని పరిరక్షించడంలో భాగస్వాములు కావాలని సమగ్రశిక్ష ఏఎంఓ రెడ్డి రామారావు సూచించారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ జీవవైవిధ్య మండలి, పాఠశాల విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో ×జీవ వైవిధ్యాన్ని కాపాడటంలో యువత పాత్ర౯ అనే అంశంపై వక్తృత్వం, చర్చా, లఘు చిత్ర ప్రదర్శనల్లో జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. సోమవారం స్థానిక కస్తూరిబా నగరపాలక బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ పోటీల్లో జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి 79 మంది విద్యార్థులు పాల్గొన్నారు. జిల్లా సైన్స్ అధికారి ఎస్.సోమయాజులు ఈ కార్యక్రమాన్ని సందర్శించారు. న్యాయ నిర్ణయాలుగా హెచ్ఎంలు ఎం.శ్రీనివాస్, జి.రమాదేవి, సైన్సు ఉపాధ్యాయులు జి.గంగాధర్, ఆర్‌వీ మల్లికార్జున్, ఐఎస్ఎల్ రామలక్ష్మి వ్యవహరించారు. డీవైఈఓ కె.రవిప్రకాష్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. పోటీల్లో విజేతల వివరాలను డీఈఓ ఎస్.అబ్రహం సోమవారం సాయంత్రం ప్రకటించారు. వక్తృత్వ పోటీల్లో వై.దివ్యశ్రీ, టి.హాస్యసుమ, పి.జెస్సికా, జీవ వైవిధ్యంపై చర్చా పోటీల్లో పి.ఎల్షి కేజియా, బి.శ్వేత, పి.నీరజలక్ష్మీ దయాళ్, షార్ట్‌ఫిల్మ్ పోటీల్లో పి.మౌనిక, డి.కుసుమ, ప్రసన్న వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు.

దోమల నివారణ మందు పిచికారీ


కొమడవోలులో పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న ఎంహెచ్ఓ మాలతి

ఏలూరు (టూటౌన్): సీజనల్ వ్యాధులు ప్రబలకుండా నిర్వహిస్తున్న స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా ఒకటవ డివిజన్ పరిధిలోని కొమడవోలు, కోడేలు మెయిన్ రోడ్డు, హమాలీ కాలనీ ప్రాంతాల్లో దోమల లార్వా నిర్మూలనా కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. నగర పాలక సంస్థ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మాలతి మాట్లాడుతూ దోమల లార్వా నిర్మూలనకై స్ప్రేయింగ్, మురుగు కాలువ కల్వర్టు కింద ఫాగింగ్, ఖాళీ స్థలాల్లో ఉన్న నిల్వ నీటిలో ఆయిల్ బాల్స్ వేస్తున్నామన్నారు. పలు ప్రాంతాల్లో డ్రెయిన్లలో పూడిక తీయించినట్లు తెలిపారు. నాయకులు గరికపూడి చంటిబాబు, మురాల దుర్గారావు, మేతర అశోక్, మలేరియా ఇన్‌స్పెక్టర్ దత్తి వేణుగోపాల్‌స్వామి, మలేరియా మేస్త్రి డి.దుర్గారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బౌన్‌రాజు పాల్గొన్నారు.

గ్రామీణాభివృద్ధి శిక్షణకు ఎంపిక


వి.శ్రీలత, ఎంపీడీవో, దెందులూరు

దెందులూరు: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి శిక్షణ కార్యక్రమానికి దెందులూరు ఎంపీడీవో వి.శ్రీలత ఎంపికయ్యారు. తూర్పుగోదావరి జిల్లా సామర్లకోటలో మూడు రోజులపాటు పంచాయితీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర ఉన్నతాధికారులు ఎంపీడీవోలకు, ప్రజా ప్రతినిధులకు శిక్షణ ఇస్తారు. సోమవారం ఎంపీడీవో సామర్లకోటకు మూడు రోజుల పాటు శిక్షణకు వెళ్లారు.

148 అడుగుల జాతీయ పతాకంతో ర్యాలీ


148 అడుగుల జాతీయ పతాకంతో ర్యాలీ చేస్తున్న నర్సింగ్ కళాశాల విద్యార్థినులు

దెందులూరు: జాతీయ పతాకం రూపకర్త పింగళి వెంకయ్య భారతవాణికి ఆదర్శప్రాయమని దెందులూరు నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు అన్నారు. సోమవారం జాతీయ పతాకం రూపకర్త పింగళి వెంకయ్య జయంతి, వారోత్సవాలు, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా బీఆర్‌డీ నర్సింగ్ కళాశాల విద్యార్థినులు 70 మంది భారీ ర్యాలీ నిర్వహించారు. జాతీయ పతాకం ఆవశ్యకత, పింగళి దూర దృష్టి విశదీకరిస్తూ నినాదాలు చేస్తూ ఇంద్రవనం, 9వ వార్డు, ఇండియన్ బ్యాంకు సెంటర్, గ్రంథాలయం, ఉన్నత పాఠశాల, బస్టాండ్ సెంటర్, ప్రభుత్వ కార్యాలయాల సముదాయం, రెండో వార్డు మీదుగా ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా పింగళి సేవలను కొనియాడారు. ఆగస్టు 15 నాటికి 5 వేల జాతీయ పతాకాలను పంపిణీ లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు.

కేరళ బాధితుల కోసం విరాళాల సేకరణ

ఏలూరు (టూటౌన్): కేరళలో వరద బాధితులకు సహాయంగా ఐద్వా ఆధ్వర్యంలో ఆగిరిపల్లిలో సోమవారం రూ.3వేలు విరాళాలు సేకరించినట్లు ఐద్వా జిల్లా కార్యదర్శి ఎ.శ్యామలరాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కేరళలో కొండ చరియలు విరిగిపడి 400 మందికి పైగా ప్రజానీకం చనిపోయారని అన్నారు. బాధిత కుటుంబాలను ఆదుకోవడానికి విరాళాలు సేకరించామని, ఈ మొత్తాన్ని ఐద్వా కమిటీ ద్వారా కేరళ సీఎం రిలీఫ్ ఫండ్‌కు పంపిస్తామన్నారు.

శ్రీవారి సేవలో ఏలూరు డీఎస్పీ

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని ఏలూరు నూతన డీఎస్పీ బి.శ్రావణ్‌కుమార్ సోమవారం సందర్శించారు. సతీసమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆయనకు ముందుగా దేవస్థానం అధికారులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు ఆయనకు శ్రీవారి శేష వస్త్రాన్ని కప్పి వేద ఆశీర్వచనాన్ని పలుకగా, ఆలయ ఏఈఓ ఎం.దుర్గారావు స్వామివారి జ్ఞాపికను, ప్రసాదాలను అందజేశారు.

గంగానమ్మకు సారె సమర్పణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): కొత్తపేటలో వేంచేసియున్న గౌరీ పరమేశ్వర ఆలయంలోని శ్రీ గంగానమ్మ అమ్మవారి ఉపాలయంలో అమ్మవారికి శ్రావణ మాసం సందర్భంగా అధ్యక్షులు బుగ్గ నాగరాజు ఆధ్వర్యంలో సోమవారం మహిళలు అమ్మవారికి సారె సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాగణమంతా అమ్మవారి నామస్మరణతో మారుమోగింది. 250 మంది మహిళలు 108 రకాల స్వీట్స్, ఫ్రూట్స్, పిండి వంటలు, చీర, జాకెట్టు, గాజులు, పసుపు, కుంకుమలతో మంగళ వాయిద్యాలతో నగర వీధులలో అమ్మవారి నామస్మరణతో ఆలయానికి ఊరేగింపుగా విచ్చేసి పుట్టినింటి నుంచి తెచ్చిన సారెను అమ్మవారికి సమర్పించారు. ప్రధాన అర్చకులు సదాశివశర్మ, ఆలయ కమిటీ గౌరవాధ్యక్షులు మల్లిమొగ్గల సుధాకర్, తాబేలు కుమార్, దేవతోటి ప్రసాద్, సేనాపతి రాజు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి


గణపవరంలో సర్పంచ్‌ల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

గణపవరం: సర్పంచ్‌లు బాధ్యతాయుతంగా పనిచేసి గ్రామ పంచాయతీలను ఆదర్శ వంతంగా తీర్చిదిద్దడానికి కృషి చేయాలని గణపవరం ఎంపీడీవో సూర్యనారాయణ అన్నారు. సోమవారం గణపవరం మండలంలోని పంచాయతీ సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులకు మూడురోజుల పాటు నిర్వహించే శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పంచాయతీలు శానిటేషన్, తాగునీరు, సంపద సృష్టి కేంద్రాల నిర్వహణపట్ల ఏమాత్రం అలసత్వం చూపరాదన్నారు. ప్రస్తుత సీజన్‌లో గ్రామాల్లో వైరల్ వ్యాధులు విజృంభిస్తున్నందున పారిశుద్ధ్య నిర్వహణ విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. తాగునీటిని తప్పనిసరిగా క్లోరినేషన్ చేయాలన్నారు. చెత్త సంపద కేంద్రాలను మళ్లించి వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. పారిశుద్ధ్యం, క్షేత్ర పర్యటన, ఘనవ్యర్థాల సేకరణ, వేస్ట్ మేనేజిమెంట్ ప్రాసెస్, వర్మీకంపోస్టు తయారీపై సీఆర్‌పీలు సర్పంచ్‌లకు శిక్షణఇచ్చారు. ఈవోపీఆర్‌డి, పంచా యతీ సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షురాలు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కొత్త ఆవిష్కరణలకు నాంది పలకాలి


పోటీల్లో గెలుపొందిన విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న అతిథులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): యువత సృజనాత్మక ఆలోచనలు పెంపొందించుకుని నూతన ఆవిష్కరణల వైపు అడుగులు వేయాలని సెట్‌వెల్ సీఈఓ సీ మధుభూషణరావు అన్నారు. స్ఫూర్తి స్వచ్ఛంద సంస్థ, జిల్లా యువజన సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం స్థానిక సత్రంపాడు ఆదిత్య డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ యువజన దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మధుభూషణరావు మాట్లాడుతూ విద్యార్థులు నేటి డిజిటల్ యుగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి చదువులలో ముందంజలో ఉండాలన్నారు. కొత్త వృత్తి నైపుణ్య కోర్సులను నేర్చుకుని జీవితంలో బాగా స్థిరపడాలని ఆకాంక్షించారు. స్ఫూర్తి సంస్థ కార్యదర్శి షేక్ మొహిద్దీన్ బాషా మాట్లాడుతూ జీవితంలో ఎదగాలంటే క్రమశిక్షణ, పట్టుదల అలవర్చుకుంటే ఉన్నత స్థానానికి చేరవచ్చన్నారు. మానవతా సంస్థ చైర్మన్ ఆలపాటి నాగేశ్వరావు మాట్లాడుతూ విద్యార్థులు మంచి విలువలు కలిగి ఉంటేనే మంచి స్థాయికి చేరవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మానవత జిల్లా అధ్యక్షులు దేవినేని భాస్కర్, సెట్‌వెల్ మేనేజర్ పీవీఎస్ సత్యనారాయణ, కళాశాల ప్రిన్సిపాల్ వీ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. విద్యార్థులకు నిర్వహించిన వ్యాస రచన, డిబేట్, క్విజ్ పోటీలలో విజేతలకు స్ఫూర్తి స్వచ్ఛంద సంస్థ ద్వారా జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందజేశారు.

రాజ్యాంగంపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యార్థులు రాజ్యాంగంపై అవగాహన పెంచుకునే ప్రయత్నం చేయాలని పలువురు వక్తలు సూచించారు. ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం, హేలాపురి బాలోత్సవం, భారత్ బచావో బహుజన్ ఆఫీసర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్, ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ ఏలూరు, ఏలూరు స్మార్ట్ సిటీ లయన్స్ క్లబ్ తదితర సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 78వ స్వాతంత్ర్య దినోత్సవం, భారత రాజ్యాంగం 75వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు చిత్రలేఖనం, స్వాతంత్ర్య యోధుల వేషధారణ పోటీలు నిర్వహించారు. 100 స్కూళ్లు, కళాశాలలకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. అనంతరం రామకోటి కళావేదికపై జరిగిన సభకు నిర్వాహక కమిటీ సమన్వయకర్త గుబ్బల నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు మాట్లాడుతూ ప్రజలను ఐక్యంగా ఉంచడంలో భారత రాజ్యాంగం ఎంతగానో తోడ్పతుందన్నారు. నెహ్రూ యువ కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ డి.కిషోర్ మాట్లాడుతూ యువజన సంఘాలు ఏర్పాటు చేసుకుంటే తమ శాఖ ద్వారా క్రీడలలో ప్రోత్సహిస్తామన్నారు. మాజీ ఎమ్మెల్సీ రాము సూర్యారావు మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవం, రాజ్యాంగ దినోత్సవం కలిపి వినూత్న కార్యక్రమం చేపట్టిన నిర్వాహకులను అభినందించారు. రాజ్యాంగ పీఠికను దేవరకొండ వెంకటేశ్వర్లు చదివి సభలోనివారితో ప్రమాణం చేయించారు. పోటీలలో పాల్గొన్న విద్యార్థులకు సీహెచ్ జగదీష్, టీ.తులసి, కే. శ్రీనివాసరావు బృందం సర్టిఫికెట్లు అందజేశారు.